శుక్ర వారం
03-03-2023
సంపుటి - 08,
సంచిక - 267
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

SAMA SAMAJAM TELUGU DAILY

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ప్రగతి పథంలో తెలంగాణ

- ఫార్మా కంపెనీలకు హబ్‌గా తెలంగాణ
- దేశంలో సక్సెస్‌ఫుల్ స్టార్ట్ అప్ కంపెనీలకు అడ్రస్
- నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భావం
- ఆత్మనిర్భర భారత్‌తో పెద్దగా ప్రయోజనం లేదు
- మంత్రి కెటిఆర్ అభిప్రాయం






**హైదరాబాద్, మార్చి2 (సమసమాజం):** తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తోందని మంత్రి కెటిఆర్ అన్నారు. దేశంలో సక్సెస్ ఫుల్ స్టార్ట్ అప్ అంటే తెలంగాణ రాష్ట్రం అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్బీఐ నివేదిక ప్రకారం తెలంగాణ దేశంలో నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అని చెప్పుకొచ్చారు. కొత్త రాష్ట్రంలో ఎన్నో స్టార్టప్‌లో సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఫార్మా కంపెనీలకు హబ్‌గా మారిందని అన్నారు. కరోనా వ్యాక్సిన్ విషయంలోనూ హైదరాబాద్ భాగస్వామ్యం ప్రపంచానికి తెలిసిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అధికా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణలో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. టీఎస్ ఐ పాస్‌తో పరిశ్రమలకు 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. విభజన సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నా.. మౌలిక వసతుల్లో ముందుకు దూసుకెళ్తున్నామన్నారు. అగ్రి ఉత్పత్తులు కూడా రాష్ట్రంలో బాగా పెరిగాయని ఆయన అన్నారు. రైతులకు సాయం అందించే ఒదుకు రైతుబంధు తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. పారిశ్రామిక అభివృద్ధి కూడా రాష్ట్రంలో వేగంగా జరుగుతోదన్నారు. ఆత్మనిర్బర్ భారత్ ప్యాకేజితో చాలా మందికి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. ఇన్వెస్ట్ ఇండియా కూడా పరిశ్రమలకు మరింత సహకారం అందించాలన్నారు. సీఐఐ కూడా కేంద్రం దగ్గర గట్టిగా 3వ పేజీలో...

## దేశ సమస్యలపై పోరుబాట

**10న జంతర్‌మంతర్ వద్ద కవిత ధర్నా**




**హైదరాబాద్, మార్చి 2 (సమసమాజం):** దేశం కోసం.. దేశ భవిత కోసం.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత నిరాహార దీక్ష చేయబోతున్నారు. ఈనెల 10వ తేదీ ఢిల్లీలో ఈ దీక్షకు రెడీ అవుతున్నారు. దేశ రాజధాని జంతర్ మంతర్ దగ్గర.. ఒక్క రోజు దీక్షకు దిగుతున్నారు. భారత్ జాగృతి ఆధ్వర్యంలో.. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ పై ఈ దీక్ష చేపట్ట నున్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లోనే మహిళా బిల్లును సభలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ.. ఎమ్మెల్సీ కవిత దీక్షకు దిగుతున్నారు. మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్ తోపాటు తెలంగాణ రాష్ట్రానికి ఎంపీ సీట్లను పెంచాలని.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు కవిత. బీజేపీ 3వ పేజీలో...

## శ్రీచైతన్య కాలేజీలోకి ఎంపికి అనుమతి నిరాకరణ

**యాజమాన్యం తీరుపై మండిపడ్డ కోమటిరెడ్డి**

**కాలేజీ ముందు ధర్నాకు దిగిన ఎంపి**



**హైదరాబాద్,మార్చి 2 (సమసమాజం):** నార్సింగిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య ఘటనపై ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీరియస్ అయ్యారు. సాత్విక్ ఆత్మహత్య పట్ల కాలేజీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు వెంకటరెడ్డి స్వయంగా శ్రీ చైతన్య కాలేజీకి వెళ్లారు. కాలేజీ లోపలికి వెళ్లకుండా తనను అడ్డుకున్న సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం కాలేజీ ఆవరణలో దీక్ష చేపట్టారు. కాలేజీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల ప్రాణాలు తీస్తున్నారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. సాత్విక్ సూసైడ్ నోటులో పేర్కొన్న నలుగురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన నలుగుర్ని అరెస్ట్ చేసే వరకు దీక్ష కొనసాగిస్తానని చెప్పారు. సాత్విక్ ఘటనపై కాలేజీ యాజమాన్యం వివరణ ఇవ్వాలని కోరారు. సమాచారం అందుకున్న ఏసీపీ రమణగౌడ్ చైతన్య కాలేజ్ వద్దకు చేరుకుని కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. ఆందోళన చేయవద్దని.. సాత్విక్ కేసుపై విచారణ జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం నార్సింగి శ్రీ చైతన్య కాలేజీ వద్ద ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

## సత్ఫలితాలు ఇస్తున్న ఫేస్ రికగ్నేషన్

**నకిలీ దందాలకు చెక్ పడిందన్న టిటిడి ఇవో**



**తిరుమల, మార్చి 2 (సమసమాజం):** తిరుమలలో అమలులోకి వచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధా నం సత్ఫలితాలు ఇస్తోందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. దీంతో ఇక అక్ర మాలకు చెక్ పడనుంద`న్నారు. నకిలీ వ్యవహారాలు సాగవని కూడా అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నూతన విధానం ద్వారా దళారీల బెడద తప్పిందన్నారు. గదులు రొటేషన్ చేసే విధానం కూడా ఆగిపోయిందని చెప్పారు. ఈ విధానంతో నిజమైన భక్తులే గదులు పొందుతున్నారని అన్నారు. ఈ విధానం ప్రవేశ పెట్టడంతో భక్తులకు త్వరగతిన గదులు లభిస్తున్నాయని తెలిపారు. సర్వదర్శనం భక్తులకు ఈ విధానం ద్వారానే ఉచిత లడ్డు టోకెన్లను జారీ చేస్తున్నట్లు చె ప్పారు. రానున్న రోజు ల్లో ఈ విధానాన్ని ఇంకా పటిష్టం చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నుంచి తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ యాప్ అమలు లోకి వచ్చిన విషయం తెలిసిందే. శ్రీవారి సర్వదర్శనం, లడ్డూ ప్రసాదం, గదుల కేటాయింపు, రిఫండ్ చెల్లింపునకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని టీటీడీ ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఈ యాప్ ద్వారా దర్శనం, లడ్డూల పంపిణీలో అవకతవకలు జరిగే అవకాశం ఉండదని టీటీడీ భావిస్తోంది.

## పోలీసు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

**రాష్ట్ర పోలీసులకు పతకం**



**హైదరాబాద్,మార్చి 2 (సమసమాజం):** అఖిల భారత పోలీసు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర పోలీసులకు పతకం వరించింది. డీసీపీ శ్రీ బాలా, అదనపు డీసీపీ నరసింహారెడ్డి జోడికి రజత పతకం లభించింది. ఈ సందర్భంగా శ్రీబాలా, నరసింహారెడ్డిని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌అభినందించారు. ఫిబ్రవరి 20 నుంచి 26వ తేదీ వరకు చండీఘర్ వేదికగా 15వ అఖిల భారత పోలీసు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. శ్రీబాలా రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో రోడ్ సేఫ్టీ వింగ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. నరసింహారెడ్డి సీపీఎస్‌లో అడిషనల్ డీసీపీగా పని చేస్తున్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడుల వరద
## లక్షమందికి ఉద్యోగావకాశాలు

**సిఎం కెసిఆర్‌ను కలిసిన ఫాక్స్ కాన్ సంస్థ ప్రతినిధి బృందం**



**హైదరాబాద్,మార్చి 2 (సమసమాజం):** తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ప్రపంచ స్థాయి కంపెనీలు తమ సంస్థలను రాష్ట్రంలో స్థాపించి, కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. తాజాగా మరో మెగా పెట్టుబడి రాషట్రానికి వచ్చి వచ్చింది. తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నట్లు ఫాక్స్ కాన్ సంస్థ గురువారం ప్రకటించింది. ఈ మేరకు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ తో ఫాక్స్ కాన్ 2వ పేజీలో...

## రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ ధరలపై బిఆర్ఎస్ ఆందోళన

- వంటావార్పులతో నిరసనలు..ధర్నాలు
- పలు జిల్లాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు



**హైదరాబాద్,మార్చి2 (సమసమాజం):** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిం చారు. మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మె ల్సీలు, జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్ల చైర్మన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. కరీంనగర్ పట్టణం తెలంగాణ చౌక్ లో రోడ్లపైనే కట్టెల పొయ్యిలపై వంట వార్పు నిర్వహించి భోజనాలు చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పెంచిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణెశ్ గుప్తా, మేయర్ నీతూ కిరణ్, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన 9 సంవత్సరాలుగా ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లో ఉన్నాయని అన్నారు. ధర్నా అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహబూబాబాద్ పట్టణం నెహ్రూ సెంటర్ లో ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంటవార్పు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లాలోని త్రిపురారం మండల కేంద్రంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, మహిళలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ కేంద్రమైన సంగారెడ్డిలో బీఆర్ఎస్ నాయకుల నిరసన తెలిపారు. టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పట్నం మాణిక్యం తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఓఆర్ఆర్‌పై కొల్లూరు వద్ద లారీ బీభత్సం

**అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురు మృతి**

**సంగారెడ్డి, మార్చి 2 (సమసమాజం):** సంగారెడ్డి జిల్లా కొల్లూరు వద్ద ఔటర్ రింగురోడ్డుపై లారీ బీభత్సం సృష్టించింది. ఓఆర్ఆర్‌పై వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుడిసెలోకి దూసుకెళ్లింది. అక్కడితో ఆగకుండా ఓఆర్ఆర్ పక్కన చెట్లకు నీళ్లుపోస్తున్న కార్మికులను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్‌సహాయంతో లారీని అక్కడిన ఉంచి తొలగించారు. మృతులను బాబు రాథోడ్, కమలీబాయ్, బసవప్ప రాథోడ్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కీలక బిల్లుల ఆమోదంలో తిరకాసు

**గవర్నర్ తమిళసై తీరుపై సుప్రీంలో ప్రభుత్వం కేసు**



**న్యూఢిల్లీ, మార్చి 2 (సమసమాజం):** రాష్ట్ర గవర్నర్ తమిళిసై వ్యవహారంపై తెలంగాణ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 10 బిల్లులను గవర్నర్ తమిళిసై ఆమోదించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా తమిళిసై సౌందర్ రాజన్ పేరును చేర్చారు. బిల్లులను గవర్నర్ ఆమోదించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి 7 బిల్లులు, గత నెల నుంచి 3 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు 2వ పేజీలో...

## డాక్టర్ ప్రీతి మృతి కేసు

**నాలుగురోజుల పోలీస్ కస్టడీరిక సైఫ్**

**ఖమ్మం జైలు నుంచి వరంగల్‌కు తరలింపు**



**వరంగల్, మార్చి 2 (సమసమాజం):** డాక్టర్ ప్రీతి మృతి కేసులో సైఫ్ ను పోలీసులు కస్టడీ లోకి తీసుకున్నారు. ఖమ్మం జైలు నుంచి వరంగల్‌కు తీసుకువచ్చారు. సైఫ్‌ను నాలుగు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. సైఫ్‌ను వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి పోలీసులు విచారిస్తున్నారు. కస్టడీలో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించి ప్రీతి కుటుంబసభ్యులు కీలకమైన ఆరోపణలు చేశారు. కేసుకు సంబంధించి సరైన విచారణ జరగడం 2వ పేజీలో...

## తెలంగాణలో బాగుపడ్డది కెసిఆర్ కుటుంబమే

**ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పు లేదు: బండి**



**హైదరాబాద్,మార్చి 2 (సమసమాజం):** ప్రత్యేక తెలంగాణ వచ్చినా.. ఎవరి బతుకులు కూడా బాగుపడలేదని కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని వెల్లడించారు. వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే కాదు.. హత్య చేస్తే ఈ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. మాజీ ఎంపీ భూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో అత్యాచారాలు చేసే వాళ్ళు బీఆర్ఎస్, ఎంఐఎం వాల్లే అయివుంటున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాకముందు ఆర్టీసి ఉద్యోగులు ఉద్యమం చేస్తే వచ్చిన తెలంగాణలో ఆర్టీసి ఉద్యోగుల పరిస్థితి నేడు దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం కట్టిన రైతులకు ఏమి ఉపయోగం లేదన్నారు. తెలం 2వ పేజీలో...

## ఈశాన్య ఫలితాల ప్రభావం ఉండదు



**సాధారణ ఎన్నికల్లో బిజెపికి దెబ్బతప్పదు**

**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే**

**న్యూఢిల్లీ, మార్చి2 (సమసమాజం):** త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల శాసన సభలకు జరిగిన ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న లోక్‌సభ ఎన్నికలపై ఉండదని కాంగ్రెస్ విశ్లేషించింది. సాధారణ ఎన్నికల్లో పరిస్థితులు వేరుగా ఉంటాయని అంటోంది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా సమర్థించారు. సాధారణంగా ఈశాన్య రాష్ట్రాల్లోని పార్టీలు కేంద్ర ప్రభుత్వంవైపు వెళ్తూ ఉంటాయని చెప్పారు. అయితే చాలా మంది నేతలు జాతీయ రాజకీయాలకు కట్టుబడి ఉంటారని తెలిపారు. అటువంటి వారు కాంగ్రెస్, లౌకికవాద పార్టీలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలకు మద్దతిస్తారన్నారు. ఈశాన్యా రాష్ట్రాలైన మేఘాలయ, త్రిపు,నాగాలాండ్‌లలో ఇటీవలే ఎన్నికలు ముగియగా.. ఈ మూడు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 2వ పేజీలో...

# సంపాదకీయం

## దొంగదెబ్బ తీయడంలో ఆరితేరిన బిజెపి !

మూడు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్ బాదుడు మొదలయ్యింది. నేడోరేపో.. పెట్రో ధరలు కూడా మంటపెట్టడం ఖాయం. గ్యాస్ ధరలను ఇప్పటికే మూడింతలు పెంచారు. ఈ ఎనిమిదేళ్లలో గ్యాస్ ధర రు. 450 నుంచి 1150కి చేరింది. పెట్రో ధరలు కూడా ఇష్టం వచ్చినట్లుగా పెంచుతున్నారు. ఇందులో కిటుకేమిటంటే ఎన్నికలు అయ్యాక మెల్లగా పెంచడం అలవాటు చేసుకున్నారు. మూడు ఈశాన్యా రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతో మార్చి1న గ్యాస్ ధరను 50 పెంచారు. కమర్షియల్ సిలిండర్ ధరను మరింతగా పెంచారు. నిజంగా దీనిని దొంగదెబ్బతీయడం అంటారు. వేదాలు వల్లిస్తున్న బిజెపి ఇలా దొంగదెబ్బ తీయడం అలవాటు చేసుకుంది. ఏ పని చేయకున్నా..జిఎస్టీ వాతలు, ధరల పెంపులో ఆరితేరింది. సమస్యలను పరిష్కరించకుండా నాన్చివేయడంలోనూ దానిని మించిన పార్టీ మరోటి ఉండదు. ఇందుకు తెలుగు రాష్ట్రాలే ఉదాహరణ. విభజన సమస్యలు,నీటి పంపకాలు, విద్యుత్ సంకెళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి నేతలు అమోఘమైన తెలివి తేటలతో రాజ్యం ఏలుతున్నారు. ఇంతగా దోఖా చేస్తున్న వీరు తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలన్న లక్ష్యంతో దూకుడు పెంచారు. మరి వీరు సమస్యలపై మాట్లాడకుండా ఎదురుదాడితో వస్తున్నారు. కేవలం కెసిఆర్, జగన్ పాలనపై దుమ్మెత్తి పోయడం ద్వారా అధికారంలోకి రావడమే వీరి ప్రధాన ఎజెండగా మారింది. పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచడమే కాదు...దేశంలో నీటి సమస్యలను, విద్యుత్ సమస్యలను తీర్చడంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. ఈ యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మల్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళన లు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని వస్తామని చెప్పిన మోడీ అంతులో పూర్తిగా విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేధిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయారాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణ పూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు అప్పర్ భద్రకు అనుమతి ఇవ్వడంతో ఇప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందన్న ఆందోళన వస్తోంది. అప్పర్ భద్రకు నిధులు కూడా కేటాయించారు. ఈ క్రమంలో ఎగువన కృష్ణాకు వరదలు వస్తే తప్ప దిగువున ఉన్న తెలుగు రాష్ట్రాలకు నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని నదుల అనుసంధానానికి పూనుకోవాలి. కాళేశ్వరంతో తెలంగాణ కూడా సస్యశ్యామలం కాగలదు. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కలు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట సమస్యమరింత జటిలం అయ్యింది.కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కులెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. నిజానికి ఈ పంచాయితీలను కేంద్రం తెంచాలి. కానీ కేంద్రం గోడవాటం పిల్లిలాగా వ్యవహరిస్తోంది. దేశంలో ధరలు పెంచాల్సి వచ్చినప్పుడు ఎంత కటువుగా ఉంటున్నారో సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అంతే కటువుగా ఉంటే మంచిది. సమస్యలను సమస్యలుగా చూడడం బిజెపి అలవాటు చేసుకోవాలి. పెట్రో, గ్యాస్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలి. నదీజలాలు ప్రజలకు అందాలి. ఈ విధానం అవలంబించకుంటే దేశం మరింతగా వెనక్కిపోతుందని గుర్తించాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## రాష్ట్రంలో పెట్టుబడుల వరద
# లక్షమందికి ఉద్యోగావకాశాలు

(మొదటి పేజీ తరువాయి) చైర్మన్ యంగ్ లియూ భేటీ అయి ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని ఫాక్స్ కాన్ ప్రకటించింది. తెలంగాణలో ఫాక్స్ కాన్ పెట్టుబడులపై హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. లక్ష మందికి ఉపాధి కల్పించడం గొప్ప విషయమన్నారు. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన అనంతరం ఫాక్స్ కాన్ చైర్మన్ యంగ్ లియూ ప్రకటించారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒపపందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



## అతిపెద్ద ప్రాటోటైపింగ్ కేంద్రంగా టీ-వర్క్స్

### ఫాక్స్ కాన్ చైర్మన్ యంగ్ లియూతో కలిసి ప్రారంభించిన కేటీఆర్

హైదరాబాద్,మార్చి2(ఆర్ఎన్ఎ): దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ కేంద్రంగా నిర్మించిన టీ-వర్క్స్‌ను ఫాక్స్ కాన్ చైర్మన్ యంగ్ లియూతో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. టీ వర్క్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీ వర్క్స్ సీఈవో సంజయ్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు పలువురు పాల్గొన్నారు. ÷రాయదుర్గం ఐటీ కారిడార్‌లో ఒకే చోట సుమారు 18 ఎకరాల్లో టీ-హబ్, టీ-వర్క్స్, ఇమేజ్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ ఇప్పటికే వివరించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిధులు వెచ్చించి ప్రజల కోసం తీసుకొస్తున్నదని చెప్పారు. ఉత్పత్తుల ఆవిష్కరణలో దేశంలోనే అగ్రగామిగా నిలిచేలా టీ-వర్క్స్‌ను ప్రభుత్వం డిజైన్ చేసిందని, దైనందిన జీవితంలో అవసరమయ్యే వస్తువులను వినూత్నంగా తయారు చేయాలన్న ఆలోచన ఉన్నవారు టీ-వర్క్స్‌కు వస్తే, వారి ఆలోచనలకు అనుగుణంగా వస్తువులను తయారు చేసుకొనే అవకాశం కల్పిస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇందుకు ఇప్పటివరకు 200కు పైగా అత్యాధునిక యంత్రాల కోసం రూ.110 కోట్లు వెచ్చించామని,




మరో రూ.40 కోట్ల వరకు కార్పొరేట్ సంస్థల నుంచి వచ్చే అవకాశం ఉన్నదని వివరించారు. టీ-వర్క్స్ మొదటి దశ 78 వేల చదరపు అడుగుల్లో ఉన్నదని, ఇందులోనే ఉత్పత్తుల రూపకల్పన, ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేషన్, సోర్సింగ్, మెటీరియల్స్, ఇతర అంశాలపై టీ-వర్క్స్‌లో నిపుణులు అందుబాటులో ఉండి ఆవిష్కర్తలకు సహకరిస్తారని తెలిపారు.

### ప్రీతి ఆత్మహత్య కేసులో
## ప్రభుత్వం చర్యలు
### అనస్థీషియా విభాగం హెచ్ఓడీ నాగార్జునరెడ్డిపై బదిలీ వేటు

వరంగల్,మార్చి2(ఆర్ఎన్ఎ):మెడికో విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య కేసులో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేఎంసీ హెచ్ఓడీపై వేటు వేసింది. ప్రీతిని వేధించిన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను మందలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఇటీవల ఎంజీఎంలో త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అనస్థీషియా విభాగం హెచ్ఓడీ డాక్టర్ నాగార్జునరెడ్డిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయన్ను భూపాలపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల అనస్థీషియా విభాగం హెచ్ఓడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే సైఫ్‌ను పోలీసులు కస్టడీ లోకి తీసుకున్నారు. ఖమ్మం జైలు నుంచి వరంగల్ కు తీసుకువచ్చారు. సైఫ్‌ను నాలుగు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. సైఫ్‌ను వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి పోలీసులు విచారిస్తున్నారు. కస్టడీలో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

## దేశ సమస్యలపై పోరుబాట



(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం జనాభా లెక్కలు కూడా చేయలేదన్నారు. బీసీ జనాబా లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ప్రకారం ఎవరి హక్కులు వాళ్లకు రావాలని స్పష్టం చేశారు.

## ప్రగతి పథంలో తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)మాట్లాడి కొత్త పరిశ్రమలకు లబ్ది చేకూరేలా చూడాలని మంత్రి కేటీఆర్ కోరారు. టిఆర్ఎస్ ఎనిమిదిన్నరేండ్ల పాలనలో తలసరి ఆదాయం బాగా పెరిగిందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2.78 లక్షలకు చేరింద న్నారు. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే అని కేటీఆర్ స్పష్టం చేశారు. 20 ఏండ్ల క్రితం హైదరాబాద్‌లో పెద్దగా కంపెనీలు లేవు. ఇప్పుడు హైదరాబాద్‌లో అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఉన్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆవిష్కరణలు, స్టార్టప్‌లను బాగా ప్రోత్సహి స్తుందన్నారు. తెలంగాణలో ఎన్నో స్టార్టప్ లు వచ్చి విజయవంతంగా నడుస్తు న్నాయి. తమ ప్రభుత్వం తెచ్చిన టీఎస్ ఐపాస్ బాగా విజయవంతమైందన్నారు. పరిశ్రమలకు 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. 500 మీటర్ల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న పరిశ్రమలకు సత్వర అనుమతి ఇస్తున్నామని చెప్పారు. మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రంతో పాటు చాలా రాష్ట్రాలు కాపీ కొట్టాయని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తి చేశాం. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ప్రతి ఎకరాకు అందిస్తున్నామన్నారు. వ్యవసాయరంగంలో కూడా తెలంగాణ అభివృద్ధి చెందిందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయన్నారు. పంజాబ్ కంటే అధికంగా వరి ధాన్యాన్ని పండించామని చెప్పారు. ఏ ప్రధాని, ఏ ముఖ్యమంత్రి కూడా రైతులకు లబ్ది చేసే చర్యలు తీసుకోలేదు. కానీ సీఎం కేసీఆర్ వ్యవసాయ పెట్టుబడి కోసం రైతుబంధు కింద సంవత్సరానికి రెండుసార్లు ఎకరాకు రూ. 5 వేల చొప్పున ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 24 నుంచి 31 శాతానికి పెంచామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందని స్పష్టం చేశారు. తెలంగాణ నుంచి అన్ని దేశాలకూ ఔషధాలు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. వ్యాక్సిన్ల ఉత్పత్తికి తెలంగాణలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. తెలంగాణ మెడికల్ హబ్‌గా మారిందన్నారు. తెలంగాణ నుంచి అన్ని దేశాలకూ ఔషధాలు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు.

## కీలక బిల్లుల ఆమోదంలో తిరకాసు

(మొదటి పేజీ తరువాయి)గవర్నర్ తమిళిసై పై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటీషన్ వేసింది. గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించిన 10 బిల్లులను పెండింగ్ లో పెట్టారని.. ఆమోదిం చకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ.. తెలంగాణ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయటం సంచలనంగా మారింది. చీఫ్ సెక్రటరీ ఈ పిటీషన్ ను అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేయటం విశేషం. గవర్నర్ తమిళిసై వ్యవహార తీరు బాగోలేదని.. ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకపోవటాన్ని తప్పుపడుతుంది ప్రభుత్వం. ఆరు నెలలుగా 10 బిల్లులను ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారని వాదిస్తూ.. గవర్నర్ పరిధి ఏంటీ.. ఎందుకు బిల్లులు ఆమోదించటం లేదనే విషయాన్ని సుప్రీంకోర్టులోనే తేల్చుకోవాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే పిటీషన్ దాఖలు చేస్తూ.. బిల్లులను గవర్నర్ ఆమోదించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. ఈ పిటీషన్ మార్చి 3వ తేదీన విచారణకు వచ్చే అవకాశం ఉంది. రిట్ పిటీషన్ విచారణతో గవర్నర్ పరిధి ఏంటీ అనే విషయంలో స్పష్టత వస్తుందని.. బీజేపీ పాలనలో గవర్నర్ల తీరును దేశవ్యాప్తంగా తీసుకెళ్లినట్లు అవుతుందని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. ఈ ఉద్దేశంతోనే సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే క్రమంలో బీజేపీ వాదన మరోలా ఉంది. రాజ్యాంగ పరిధిలో బిల్లులు అంటే.. గవర్నర్ ఆమోదిస్తారని.. రాజ్యాంగ పరిధికి భిన్నంగా ఉంటే బిల్లులను ఎలా ఆమోదిస్తారని ప్రశ్నిస్తుంది. అధికారం ఉంది కదా అని చట్ట, న్యాయ, ప్రజా వ్యతిరేక బిల్లులను పంపిస్తే.. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన గవర్నర్ ఎలా ఆమోదిస్తారని ఎదురుదాడి చేస్తుంది బీజేపీ. గవర్నర్ రాజ్యాంగానికి లోబడి పని చేస్తారని.. ప్రభుత్వాలు చెప్పినట్లు పని చేయరని అంటోంది బీజేపీ..ఎవరి వాదనలు ఎలా ఉన్నా.. సుప్రీంకోర్టులో విచారణపై ఆసక్తి నెలకొంది..

## ఈశాన్య ఫలితాల ప్రభావం ఉండదు

(మొదటి పేజీ తరువాయి) ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం వీటన్నిటిలోనూ బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల్లోని రాజకీయాలు వేరుగగా ఉంటాయన్నారు. పార్టీలు సాధారణంగా లౌకికవాద పార్టీలకు మద్దతిస్తాయన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్ కూటమి ఏర్పడటానికి ఈ పార్టీలు అనుకూలంగా ఉంటాయన్నారు. తమతో జట్టుకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ముందడుగు వేయాలని ఈ పార్టీలు కోరుకుంటాయన్నారు. ఇదిలావుండగా, నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమి 35 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. త్రిపురలో బీజేపీ 31 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మేఘాలయలో బీజేపీ గతం కన్నా మూడు స్థానాలను ఎక్కువగా గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐదు స్థానాల్లో ఆధిక్యత ప్రదర్శిస్తోంది.

## డాక్టర్ ప్రీతి మృతి కేసు


(మొదటి పేజీ తరువాయి) లేదని ముందు నుంచి చెబుతున్నారు. ఆరోపణలు ఎదుర్కుంటున్న పోలీసులే విచారణ అధికారులుగా ఎలా ఉంటారని ప్రీతి తండ్రి ప్రశ్నిస్తున్నారు. ప్రీతిని సైఫ్ వేధిస్తున్నారంటూ మొదట ఏసీపీ బోనాల కిషన్‌కు ప్రీతి తండ్రి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోకపోవడంతో రెండు రోజుల తర్వాత ప్రీతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ప్రీతి కుటుంబసభ్యులు ఆరోపించారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కుంటున్న పోలీసు అధికారులే విచారణ జరపడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ప్రీతి సోదరుడు పృథ్వీ మాట్లాడుతూ... ప్రీతి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆధారాలు లేవన్నారు. మా అక్క ప్రీతి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. తాము ఆరోపణలు చేస్తున్న ఏసీపీనే విచారణ అధికారిగా ఉన్నారని... ర్యాగింగ్ కమిటీలోనూ ఏసీపీ తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటారని మండిపడ్డారు. కౌన్సిలింగ్ ఇచ్చామంటున్నారు కానీ, మా అక్క చెప్పలేదని పృథ్వీ తెలిపారు. అలాగే ప్రీతి కేసుకు సంబంధించి ఆమె సోదరుడు పృథ్వీ విడుదల చేసిన ఒక వీడియో సంచలనంగా మారింది. తన సోదరికి, సైఫ్‌కి కలిపి కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పిందంతా పూర్తి అబద్ధమని తెలిపాడు. హెచ్‌వోడీ పిలిచి తన సోదరిని కనీసం ఎలాంటి వివరణ అడక్కుండా తిట్టాడని పేర్కొన్నారు. సైఫ్‌కు పూర్తి సపోర్టివ్‌గా ఉన్న నాగార్జునరెడ్డితో కమిటీని ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించాడు. అలా కమిటీని ఏర్పాటు చేస్తే సైఫ్‌కి ఫేవర్‌గానే రిపోర్ట్ ఇస్తాడు కదా? అని ప్రశ్నించాడు. నిమ్స్‌లో ప్రీతి పొత్తి కడుపు వద్ద సర్జరీ చేశారని పృథ్వీ తెలిపాడు. ఆ సర్జరీ ఎందుకు చేశారనేది తెలియడం లేదన్నాడు. అలాగే ప్రీతికి చేతిపై గాయం ఉందని వెల్లడించాడు. ప్రీతికి పూర్తిగా శరీరంలో బ్లడ్ డయాలిసిస్ చేశారని తెలిపాడు. బ్లడ్ డయాలసిస్ చేస్తే.. పోస్ట్ మార్టంలో ప్రీతి బాడీలో ఉన్న ఇంజెక్షన్ గురించి ఎలా తెలుస్తుందని ప్రశ్నించాడు. నిమ్స్‌లో ఏం వైద్యం చేశారనేది తమకు చెప్పాలని ప్రీతి సోదరుడు పృథ్వీ డిమాండ్ చేశాడు. ర్యాగింగ్ కమిటీపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయన్నాడు. నాగార్జున రెడ్డి తప్పు చేసిన వ్యక్తి అయితే అసలు అతన్ని ర్యాగింగ్ కమిటీలో ఎందుకు ఉంచుతారని ప్రశ్నించాడు. ప్రీతి సెల్ ఫోన్‌లో మెసేజ్‌లను తాను చెక్ చేశానని పృథ్వీ వెల్లడించాడు. తనకు కనిపించని మెసేజ్‌లు పోలీసులకి ఎలా కనిపించాయని నిలదీశాడు. నాగార్జున రెడ్డి కమిటీ రిపోర్ట్‌ను మార్చి ఉంటారని పృథ్వీ పేర్కొన్నాడు.

## తెలంగాణలో బాగుపడ్డది కెసిఆర్ కుటుంబమే

(మొదటి పేజీ తరువాయి) గాణకు రావాల్సిన నీరు రాకుండా కేసీఆర్, హరీష్ రావు సంతకాలు చేసి అన్యాయం చేశారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు డైవర్ట్ చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. మోడీ ఇస్తున్న డబ్బులు కేసీఆర్ దోచుకుంటున్నారని తెలిపారు. ఈ ఆరు నెలలుగా ముఖ్యమంత్రి ఎప్పుడు అభివృద్ధిపై మాట్లాడలేదని.. అభివృద్ధిపై ముఖ్యమంత్రి చర్చకు రా అని అడిగిన రావడం లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గతంలో ఉన్న మంచి సంక్షేమ పథకాలు అన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలనీ అన్నారు.

# రష్యా ఊహకు అందనంతగా ప్రతిఘటన !

**ఉక్రెయిన్‌ను దారికి తెచ్చకోవడంలో విఫలం ● ఏడాది దాటినా ముగింపు దశకు చేరని యుద్ధం**



**మాస్కో, మార్చి 2 (సమసమాజం):** ఉక్రెయిన్‌పై దాడి ఇంత భయంకరంగా ఉంటుందని బహుశా రష్యా కూడా ఊహించి ఉండదు. ఒకటి రెండురోజుల్లో సునాయాసంగా ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవచ్చన్న పుతిన్ అంచనాలు తలకిందుల య్యాయి. ఏడాది దాటినా ఉక్రెయిన్‌ను దారికి తెచ్చుకోలేక పోయింది. రష్యా దాడులకు ధీటుగా ఏడాదిగా ఉక్రెయిన్ ఎదురుదాడి చేస్తూనే ఉంది. తన దేశ అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే రష్యాను గట్టిగా ఢీకొంటోంది. మరోవైపు అమెరికా తదితరదేశాలు కూడా మద్దతును పెంచుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో నష్టపోతున్న దేశాలు కూడా మెల్లగా గొంతువిప్పి రష్యా తీరును ఎండగడుతున్నాయి. రష్యాలో కూడా ఈ యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. మరోవైపు రష్యా సైనికులు వేలల్లో మరణి స్తున్నారు. ఈ క్రమంలో మెల్లగా ప్రపంచ దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అలాగే సైనిక సాయం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. పరిస్థితులు చేజారుతాయన్న భయంతో ఆయా దేశాలు కొంత వెనకడుగు వేస్తున్నాయి. లేకపోతే ఈ పాటికి ఉక్రెయిన్‌కు మద్దతుగా అనేక దేశాలు యుద్ధరంగంలోకి దిగేవే. అలాగే ఆర్థిక ఆంక్షల కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థ కూడా కుదేలవుతోంది. అణుబాంబు బూచి చూపుతున్న పుతిన్ ..ప్రపంచంలో తన ప్రతిభను పూర్తిగా కోల్పోయారు. ఆయా దేశాలు ఇప్పుడు పుతిన్‌ను చూసి ఏవగించుకుంటున్నాయి. పుతిన్ కూడా బహుశా యుద్ధం ఇంత దారుణంగా ఉంటుందని ఊహించి ఉండరు. ఒకటి రెండు రోజుల్లో ఉక్రెయిన్ దారికి వస్తుందని కదనరంగంలోకి దిగి ఉంటారు. కాకపోతే అంత ఈజీ కాదని ఇప్పుడు తెలిసి ఉంటుంది. మరోవైపు తమ లక్ష్యం పూర్తయ్యేదాకా సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా ప్రకటించింది. అడపాదడపా దాడులతో భయపెడుతూనే ఉంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా ఉక్రెయిన్ మాత్రం బాగా దెబ్బతింది. దీన్ని పునర్నించుకోవడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదు. తమను ఒంటరి చేయొద్దని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రపంచ దేశాలను ఇప్పటికే వేడుకున్నారు. ఉక్రెయిన్‌కు ఇయు సాయం కావాలని కోరారు. అణు యుద్ధం వచ్చే ప్రమాదముందని, దీనిని ఎదుర్కొనేందుకు అణు దళాలు అప్రమత్తంగా ఉండాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. మూడో ప్రపంచ యుద్ధం తప్పదని అంతా భావించారు. కానీ అది రాష్యాకు కూడా ప్రమాదమని రష్యాన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకపోతే పుతిన్ మరింత పట్టుదలగా ఉక్రెయిన్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. పౌరులు చనిపోతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అందుకే ప్రధాన నగరాలను స్వాధీనం చేసుకునే క్రమంలో వరుస రాకెట్ దాడులు, పేలుళ్లతో ఉక్రెయిన్ రగులుతోంది. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న ప్రమాదాలను తిప్పికొట్టే క్రమంలో తనను తాను రక్షించుకునేందుకు అవసరమైన ప్రధాన లక్ష్యాన్ని చేరుకునే వరకూ ఉక్రెయిన్‌లో చేపట్టిన ప్రత్యేక సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా రక్షణ శాఖ మంత్రి తెలిపారు. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న సైనిక పరమైన ముప్పు నుంచి రక్షించు కోవడమే రష్యా ముందున్న ప్రధానలక్ష్యం. మా దేశంపై పోరాడేందుకు పశ్చిమ దేశాలు ఉక్రెయిన్ ప్రజానీకాన్ని పావుగా వాడుకోవాలని చూస్తున్నాయి. ఈ దుర్మార్గాన్ని సహించం. ఈ ముప్పును తిప్పికొట్టేదాకా ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. అయితే ఏడాదిగా ఇప్పటికే ఇరు దేశాలు ఎంతో నష్టపోయాయి. ఉక్రెయిన్‌లో తక్షణమే యుద్ధాన్ని నిలిపేయాల్సిన అవసరం ఉంది. ఇరుదేశాల నాయకులు శాంతిమార్గం పట్టాలి. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ నుంచి పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ సంచలన ప్రతిజ్ఞ చేశారు. ప్రాణాలు పోయినా సరే రష్యాకు లొంగేది లేదని స్పష్టం చేశారు. రష్యాకు తగిన గుణపాఠం నేర్పిస్తామంటూ పేర్కొన్నారు. రష్యా దాడుల్లో అమాయక పౌరులు, చిన్నారులు చనిపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యలకు పుతిన్ భారీ మూల్యం చెల్లించు కోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌కు మరింత సాయం అందిస్తామని ఇటీవల పర్యటన సందర్భంగా ప్రకటించారు. పుతిన్‌ను ప్రపంచం ఏకాకి చేయాలని బైడెన్ పిలుపు ఇచ్చారు. అయితే రష్యాను ఎదుర్కొ నేందుకు అమెరికన్ దళాలను పంపే ఆలోచనేలేదని అన్నారు. మొత్తంగా ఉక్రెయిన్‌పై దాడులు ఆగుతాయా లేదా అన్నది తెలియదు. అప్పటి వరకు ఉక్రెయిన్ బిక్కుబిక్కుమంటూనే పోరాడుతోంది. ఇది ఎంతకాలం అన్నది చూడాలి. రష్యా కూడా ఇది ఎంత తొందరగా యుద్ధాన్ని ముగిస్తే అంతమంచిదే.

# యాచారంలో 35కోట్ల ఘరానా మోసం

**పాకిస్తాన్ ఇస్టోర్ కంపెనీ పేరుతో లక్షలలో దందా**


**ఆందోళన చేస్తున్న భాధితులు**



**రంగారెడ్డి, మార్చి 02 (సమసమాజం):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని యాచారం మండలంలోనీ పలు గ్రామాల ప్రజలతో మాయమాటలు చెప్పి కేపీడబ్ల్యు, ఈస్టోర్ ఇండియా అనే కంపెనీ పేరుతో సుఫియాన్ అనే వ్యక్తి వారి సోదరులతో కలిసి పేద ప్రజలను నమ్మించి మోసగించి కోట్ల రూపాయలు 36 నెలలకు డిపాజిట్ చేయించుకుని ఒక లక్షకు నెలకు 9000 రూపాయలు వడ్డీగా ఇస్తానని నమ్మబలికి మూడు నెలలు డబ్బులు బాధితులకుచెల్లించగా నమ్మిన వివిధ గ్రామాల ప్రజలు లక్షల్లో డబ్బులు ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టడం జరిగింది. మూడు నెలల వరకు ఈ యొక్క డబ్బులకు త్వరగా రెట్టింపు డబ్బులు ఇస్తుండడంతో బాధితులు బంగారం, భూములకు కుదువపెట్టి చాలామంది కంపనిలోపెట్టుబడి పెట్టి మోసపోయారు. మోసపోయిన బాధితుల్లో కొంతమంది ముక్తార్ 7లక్షలు, గౌసియబెగం 20లక్షలు. రాము 18లక్షలు, ఎండి మహ్మద్ 25లక్షలు,మహ్మద్ వలి 15లక్షలు, మస్కు శ్రీశైలం 6లక్షలు, ఎం డి అక్తర్ 20లక్షలు, మహమ్మద్ 6. 50 లక్షలు రూపాయలు పెట్టుబడులు పెట్టి దానికి ఎలాంటి రసీదులు లేకుండా ఫోన్ పే, గూగుల్ పేలలో మాత్రమే డబ్బులు వేయించుకొని, కంపెనీ అకౌంట్ చూపించకుండా సొంత అకౌంట్ లోకి వేసుకొని మోసం చేయడం జరిగిందని బాధితులు వాపోతున్నారు. దాదాపు 35కోట్లు మోసం చేసిన పాకిస్థాన్ కు చెందిన కేపిడబ్ల్యు,కృప్తో కంపెనీ ముసుగులో ఎండి సుఫియాన్, ఉమ్ నాన్,ఫ,సల్మాన్, సమద్, వహీద్,యూనూస్,అజార్, ప్రజలను మభ్యపెట్టి ఇక్కడో పాకిస్తాన్ సంస్థల పేర్లు చెప్పి ఎటువంటి ఆధారాలు లేకుండా పేద ప్రజల వద్ద నుండి కోట్ల రూపాయలు కొల్లగొట్టి మొఖం చాటగా తెలుసుకున్న బాధితులు ఇంటి వద్దకు వెళ్లి నిలదీయగా మా దగ్గర డబ్బులు లేవని ఏమి చేసుకుంటారో చేసుకోండి అని తెగేసి చెప్తున్నారు. ఇట్టి మోసాలకు పాల్పడిన సుహాన్ తో పాటు అతని సోదరులను వెంటనే కస్టడీలోకి తీసుకొని విచారించి మేము కోల్పోయిన డబ్బును ఇప్పించాలని సుమారు 50 మంది బాధితులు పోలీస్ స్టేషన్ ఆశ్రయించి పూర్తి వివరాలు సి ఐ లింగయ్యకు ఫిర్యాదుచేశారు.

**టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డిని కలసిన కొత్తపల్లి**

# నూతన కాంగ్రెస్ గ్రామ కమిటి



**రంగారెడ్డి, మార్చి 02 (సమసమాజం):**యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నర్సింహ వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే శ్రీశైలం ఆద్వర్యంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి బాలయ్య మండల కాంగ్రెస్ కార్యదర్శి గా నియమకపత్రాన్ని మల్ రెడ్డి రంగారెడ్డి చేతులమీదుగా అందజేశారు. నూతన గ్రామ అధ్యక్షులు ఎం డి రన్ని నూతన యూత్ అధ్యక్షులు కాలే కుమార్ కమిటి సభ్యులతో కలిసి శాలువతో మల్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్బంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, బీ ఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని,దళిత బందు పేరుతో దళితులను మోసంచేస్తూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు కల్పిస్తామని రైతులకు రుణమాఫీ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు. రాబోయే కొద్దీ నెలల్లో రేవంత్ రెడ్డి నాయకత్వలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుంది అన్నారు. ప్రభుత్వం రాగానే ఇల్లు లేని నీరు పేదలకు ఐదు లక్షల రూపాయలు ఇల్లు నిర్మి%శీ%చుకోవటానికి ఆర్థిసహాయం,రైతులకు నాణ్యతమైన కరెంట్ తో పాటు రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ కౌలు రైతులని ఆదుకుంటామని,ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరు పేదలు ఉచిత వైద్యం,నిరుద్యుగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, గ్యాస్ 500 రూపాయలకే ఇచ్చి ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ఇట్టి విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసి అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లింగారెడ్డి కార్యదర్శి కొండాపురం కృష్ణ యూత్ ఉపాధ్యక్షులు మహేందర్ కార్యదర్శి పోలె మహేష్ సోషల్ మీడియా కన్వీనర్ పోలె వంశీ గ్రామ సీనియర్ నాయకులు వెంకటయ్య, జంగయ్య,రాములు, ఎల్లయ్య, కృష్ణయ్య,యాదయ్య, గుడ్ల మహేష్,సంజీవ, బైండ్ల రవీందర్, కాలే లింగం,చిక్కుడు వెంకటేష్,యాదగిరి, లింగం,అమీర్,మహేందేర్ రెడ్డి, చంద్రయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెంపుపై బిఆర్ఎస్ ఫైర్

**రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలతో ఆందోళన**

**ఘట్‌కేసర్ ఆందోళనలో పాల్గొన్న మంత్రులు**

**బీజేపీ అంటే భారత జనాలను పీడించే పార్టీ అన్న హరీష్ రావు**

**హైదరాబాద్,మార్చి 02 (సమసమాజం):** గ్యాస్ ధరల పెంపుపై తెలంగాణ వ్యాప్తంగా బిఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు పార్టీ నేతలు,మంత్రులు,ఎమ్మెల్యేలు ఎక్కడిక్కడ ఆందోళనలకు దిగారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. గ్యాస్ సిలిండర్‌తో ఊరేగింపులు చేపట్టారు. మంత్రి సబితా ఇంద్రా రెడ్డి వినూత్నంగా కట్టెల మోపుతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ పెద్దఎత్తున ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ అంటే భారత జనాలను పీడించే పార్టీ అని మంత్రి హరీశ్ రావు అన్నారు. నిండా ముంచిన బీజేపీని ముంచాలని ప్రజలు చూస్తున్నారని వెల్లడించారు. అన్ని వర్గాలను కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మోసం చేసిందదని విమర్శించారు. అడ్డగోలుగా గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్‌పై ప్రభుత్వం రూ.2.14 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చేదని గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ పూర్తిగా ఎత్తివేసిందని విమర్శించారు. గతంలో గ్యాస్ ధర రూ.400 ఉంటేనే ఆనాడు బీజేపీ గగ్గోలు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాటి మాటలను మోడీ మరచినా..ప్రజలు మరచిపోలేదన్నారు. మరి ఇప్పుడు రూ.1100 దాటిందని, ఆ పార్టీ నాయకులు ఎందుకు మిన్నకున్నారని ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకంలో రూ.30 వేల కోట్లు కోత పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఎం కిసాన్ యోజనలో భారీగా లబ్దిదారులను తగ్గించారని వెల్లడించారు. సంక్షేమ పథకాలపై కోతలు పెట్టి బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తున్నదని చెప్పారు. ఎన్నికల తర్వాత గ్యాస్ ధరలు పెంచడం ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు రాగానే గ్యాస్‌పై 10 పైసలు తగ్గిస్తారని, అవి పూర్తవగానే రూ.100 పెంచుతారని దుయ్యబట్టారు. పూర్తి మోసపూరింగా బిజెపి పాలన ఉందన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు వెల్లడి**

**జనగామ,మార్చి 02 (సమసమాజం):** విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లింగాల ఘనపూర్ మండలం నేలపోగుల గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన, మన ఊరు-మన బడిలో చేపట్టిన పనులకు మంత్రి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. బండి సంజయ్, రేవంత్‌రెడ్డి తుపాకీ రాముడిలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్ పై ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారని వారి మాటలను పట్టించుకోవద్దని సూచించారు. ప్రతిపక్షాల మాటలను నమ్మితే నట్టేట మునిగినట్లేనని పేర్కొన్నారు. ఉమ్మడి పాలనలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని విశ్లేషించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన రాజకీయ జీవితంలో ఇద్దరు ముఖ్యమంత్రులే నచ్చుతారని వారిలో ఒకరు ఎన్టీఆర్, మరొకరు సీఎం కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ మనసున్న మహారాజు అని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

**నగరంలో ధర్నాలో మంత్రి తలసాని డిమాండ్**



**హైదరాబాద్,మార్చి 02 (సమసమాజం):** పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఎంజీ రోడ్డులో గల గాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆందోళనకు దిగింది. గ్యాస్ సిలెండర్‌లతో నిరసన, ధర్నా చేపట్టారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మహిళలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గ్యాస్ ధరలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. మోదీ ఎన్నికల సందర్భంగా గ్యాస్‌కు దండం పెట్టి ఓటు వేయాలని చెప్పారని... కానీ ఇప్పుడు ధరలు రూ.1150 దాటిందన్నారు. కేంద్ర ఫ్లైట్ చార్జీలు తగ్గించిందని... విమానాల్లో పేదలు వెళ్తారా అని మంత్రి ప్రశ్నించారు. ప్రతి బడ్జెట్ తర్వత గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్యాస్ ధరలు రూ.50 పెంచడంతో... ఇప్పుడు రూ.1155కు చేరిందన్నారు. మోదీ వచ్చాక దాదాపు రూ.750 గ్యాస్ ధర పెరిగిందని తెలిపారు. దీని వల్ల నిత్యావసర సరుకుల ధరలు అన్ని పెరుగుతాయన్నారు. సబ్సిడీ ఇస్తున్నాం అని చెప్పారని.. ఏటా బ్జడెట్‌లో సబ్సిడీ నిధులను కేంద్రం తగ్గిస్తోందని అన్నారు. మోదీకి పాలించే హక్కు లేదని... వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. పేదల నడ్డి విరిచే ప్రధాని ఎవరికీ అవసరం లేదన్నారు. పేదల బ్రతుకులు దుర్భరంగా మారాయన్నారు.



కేంద్రం తెలంగాణపై సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# మోడీ ప్రధాని కావడం ప్రజల దురదృష్టం

**గ్యాస్ ధరలపై మండిపడ్డ బిఆర్ఎస్**

**కరీంనగర్ ఆందోళనలో మంత్రి గంగుల విమర్శలు**

**కరీంనగర్,మార్చి 02 (సమసమాజం):** భారతదేశానికి మోడీ ప్రధాని కావడం ప్రజల దురదృష్టమని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదానీకి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకే గ్యాస్ ధరలను పెంచారని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలపై ఆడబిడ్డలు ఆలోచించాలన్నారు. కరీంనగర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మంత్రి గంగుల కమలాకర్ పాల్గొన్నారు. రోడ్డు ప్రక్కన కట్టెల పొయ్యి పై వంట చేస్తూ నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి.. ప్రధాని దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీని బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని గంగుల కమలాకర్ అన్నారు. పెంచిన గ్యాస్ ధరల్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి కావడంతో.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి పేద, మధ్య తరగతి ప్రజలపై ఊహించని భారాన్ని మోపిందని మంత్రి గంగుల ఆరోపించారు. అన్ని వర్గాలను కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మోసం చేసిందదని విమర్శించారు. అడ్డగోలుగా గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్‌పై ప్రభుత్వం రూ.2.14 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చేదని గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ పూర్తిగా ఎత్తివేసిందని విమర్శించారు. మరి ఇప్పుడు రూ.1100 దాటిందని, ఆ పార్టీ నాయకులు ఎందుకు మిన్నకున్నారని ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకంలో రూ.30 వేల కోట్లు కోత పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిఆర్ఎస్నేతలు పలువురు పాల్గొన్నారు.

# ఈటెల భూకబ్జాకోరు: కాంగ్రెస్



**కరీంనగర్, మార్చి 02 (సమసమాజం):** హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పై కాంగ్రెస్ చార్జ్‌షీట్ విడుదల చేసింది. రెండెకరాల భూమి ఉన్న ఈటలకు రూ.కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈటల పెద్ద భూ కబ్జాదారుడని కాంగ్రెస్ ఆరోపించింది. అసైన్డ్, దేవాదాయ భూములను ఆయన ఆక్రమించారని ఆరోపణ చేసింది. పౌరసరఫరాల మంత్రిగా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారని ఈటలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసింది.

# శ్రీచైతన్యలో నరకం చూపిస్తున్నారు

**వారి వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్య**

**వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్య తీసుకోంటి**

**సాత్విక్ సూసైడ్ లెటర్‌లో సంచలన విషయాలు**

**హైదరాబాద్,మార్చి 02 (సమసమాజం):** కళాశాల యాజామాన్యం వేధింపుల వల్లనే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు నార్సింగిలోని శ్రీ చైతన్య కళాశాల విద్యార్థి సాత్విక్ వెల్లడించాడు. సాత్విక్ ఈ మేరకు సూసైడ్ నోట్‌లో తెలిపాడు. ఆత్మహత్య కేసులో సూసైడ్ లెటర్ ను పోలీసులు గుర్తించారు. అమ్మా, నాన్న నేను ఈ పని చేస్తున్నందుకు క్షమించండి అని సాత్విక్ తన లేఖలో రాసుకొచ్చాడు. మిమ్మల్ని బాధ పెట్టాలని తన ఉద్దేశం కాదని, కళాశాలలో ప్రిన్సిపాల్, కళాశాల ఇంఛార్జ్, లెక్చరర్ పెట్టే టార్చర్ వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని స్పష్టం చేశాడు. కృష్ణారెడ్డి, ఆచార్య, శోభన్, నరేష్ వేధింపులను తట్టుకోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఉంటున్న హాస్టల్లో వీరు ముగ్గురు కలిసి విద్యార్థులకు నరకం చూపిస్తున్నారని కూడా సాత్విక్ పేర్కొన్నాడు. వీరి వేధింపులు తట్టుకోలేకనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని, తనను వేధించిన ఈ ముగ్గురిపై చర్యలు తీసుకోండి అని లేఖలో కోరాడు. చివరకు అమ్మా, నాన్న లవ్ యూ, మిస్ యూ ఫ్రెండ్స్ అంటూ సాత్విక్ సూసైడ్ లెటర్ రాసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# ప్రీతిని దారుణంగా వేధించిన సైఫ్

**ఫ్రీ సీట్ వచ్చిందంటూ అవహేళన**

**రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి**

**హైదరాబాద్,మార్చి 02 (సమసమాజం):** సైఫ్ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగు చూశాయి. సైఫ్ ఫోన్‌లో నుండి 17 వాట్సాప్ చాట్స్‌ను పోలీసులు పరిశీలించారు. అనుషా, భార్గవి వాట్స్ అప్ గ్రూప్ చాట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రిపోర్టులో ప్రీతి, సైఫ్ మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. రెండు ఘటనల ఆధారంగా ప్రీతిపై సైఫ్ కోపం పెంచుకున్నట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడైంది. గత డిసెంబర్‌లో ఒక యాక్సిడెంట్ కేస్ విషయంలో ప్రీతిని గైడ్ చేసిన సైఫ్ ..ఆ ఘటనలో ప్రిలిమినరీ అనస్థీషియా రిపోర్టును ప్రీతి రాసింది. అయితే ప్రీతి రాసిన ఈ రిపోర్టును వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి సైఫ్ హేళన చేసినట్లు సమాచారం. అటు రిజర్వేషన్‌లో ఫ్రీ సీట్ వచ్చిందంటూ ప్రీతిని సైఫ్ అవమానించినట్లు తెలుస్తోంది. తనతో ఏమైనా ప్రాబ్లమా అంటూ సైఫ్‌ను ప్రీతి ప్రశ్నించినట్లు రిమాండ్ రిపోర్టు తెలిపింది. ఏమైనా సమస్య ఉంటే ఊక్షఆకి చెప్పాలని సైఫ్?కు ప్రీతి వార్నింగ్ ఇచ్చింది. అనస్థీషియా డిపార్ట్‌మెంట్ లో ప్రీతిను సూపర్వైజ్ చేస్తున్న సైఫ్..తన స్నేహితుడు భార్గవ్‌కు ప్రీతిని వేధించాలని చెప్పినట్లు తెలుస్తోంది. రెస్ట్ లేకుండా ప్రీతికి డ్యూటీ వేయాలని అతన్ని సైఫ్ ఆదేశించాడు. ఈ విషయమై గత నెల 21న నాగార్జునకు ప్రీతి ఫిర్యాదు చేసింది. డాక్టర్లు మురళి,శ్రీకళ,ప్రియదర్శిని సమక్షంలో ప్రీతికి, సైఫ్ కు వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే ఆ మరుసటి రోజే ప్రీతి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమాండ్ రిపోర్టులో వెలుగు చూసింది.

## ఆత్మహత్య లకు నిలయంగా

# శ్రీ చైతన్య విద్యాసంస్థలు

- జలగల్లా విద్యార్థుల రక్తం పిండుకుంటున్న శ్రీ చైతన్య యాజమాన్యం
- మార్కులు ర్యాంక్ ల కోసం విద్యార్థులను చంపుతున్న చైతన్య యాజమాన్యం
- విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి
- శ్రీ చైతన్య గుర్తింపు రద్దు చేయాలి



**రంగారెడ్డి, మార్చి 02 (సమసమాజం):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ ఎఫ్ ఐ ఇబ్రహీంపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో నార్సింగ్ లో శ్రీ చైతన్య కళాశాల గుర్తింపుని రద్దు చేయాలని ధర్నా చేయటం జరిగింది. ఈ సందర్భంగ ఎస్ ఎఫ్ ఐ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు ఏర్పుల తరంగ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నా ప్రభుత్వం ఏమి చేస్తున్నది అని ప్రశ్నించారు.నెల రోజుల క్రితం ఫర్జాది గూడ ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది.నిన్న నార్సింగ్ లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థి క్లాస్ రూం లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థులపై మార్కుల కోసం ర్యాంకు ల కోసం తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు కార్పొరేట్ శ్రీ చైతన్య నిలయంగా నిలిచింది అన్నారు. యాజమాన్యం లాభాలే ధ్యేయంగా ర్యాంకులే లక్ష్యంగా పని చేస్తు వాటిని సాధించటం కోసం విద్యార్థులు ఏమైనా ఫర్వాలేదు అన్నట్లుగా జలగలుబిరక్తం పిడిచినట్లు విద్యార్థుల రక్తాన్ని అదే తరహాలో పిద్చుకుంటున్నారు.కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం వ్యవహరిస్తోంది. కానీ ప్రభుత్వం చోద్యం చేస్తున్నది అన్నారు. సాత్విక్ కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థుల ఆత్మహత్య లకు కారణం అవుతున్న శ్రీ చైతన్య గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వాటి గుర్తింపు రద్దు అయ్యే అంత వరకు పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల సహాయ కార్యదర్శి వంశీ నాయకులు .లక్ష్మణ్ ,వర్షిత్ మధు, లోకేష్ కిషోర్ ,సంపత్ ,కిట్టు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికో హటావో....దేశ్‌కో బచావో

**పాలమూరు సభలో మంత్రి శ్రీనివాస గౌడ్ ఆందోళన**



**మహబూబ్‌నగర్,మార్చి 02 (సమ సమాజం):** పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద గురువారం మంత్రి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నల్లదుస్తులు ధరించి కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నరేంద్ర మోడీ నిరంకుశ పాలన నశించాలని ఆరోపించారు. పెరిగిన ధరలు తగ్గించే వరకు ఆడబిడ్డలు చేపట్టే ఉద్యమానికి బిఆర్ఎస్ అండగా ఉంటుందని మంత్రి చెప్పారు. పెంచిన గ్యాస్ ధరల్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తి కావడంతో.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి పేద, మధ్య తరగతి ప్రజలపై ఊహించని భారాన్ని మోపిందని మంత్రి గంగుల ఆరోపించారు. అన్ని వర్గాలను కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మోసం చేసిందదని విమర్శించారు. అడ్డగోలుగా గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్‌పై ప్రభుత్వం రూ.2.14 లక్షల కోట్ల సబ్సిడీ



ఇచ్చేదని గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ పూర్తిగా ఎత్తివేసిందని విమర్శించారు. బీజేపీకి హటావో దేశ్ కి బచావో అంటూ నినాదాలు చేశారు. మహిళలతో కలిసి ధర్నా లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింలు, ముడా చైర్మన్ వెంకన్న ముదిరాజ్, జిల్లా రైతు బంధు అధ్యక్షులు గోపాల్ యాదవ్, గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు శంతన్న యాదవ్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు రెహమాన్ పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.




# భావి తరాలకు జ్ఞానాన్ని అందించేది పుస్తకమే

**పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్**

**కరీంనగర్,మార్చి 02 (సమసమాజం):** జ్ఞాన సంపదను భద్రపరిచేది, భావితరాలకు జ్ఞానాన్ని అందించేది పుస్తకమ నేనని బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా కరీంనగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపులే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూగుల్‌ని మించిన సమాచారం పుస్తకాల్లో లభ్యమవుతుందని అన్నారు. పుస్తకాలను భావి తరాలకు అందించి, పుస్తక ప్రాముఖ్యతను పెంచడానికి పుస్తక మహోత్సవం తోడ్పడుతుందని అన్నారు. తరతరాల చరిత్రను సంపదను భద్ర పరచి, కీర్తించుకుంటామంటే పుస్తకాల ద్వారానే అని అన్నారు. స్వాతంత్ర పోరాటం నుంచి తెలంగాణ ఏర్పాటుకు ముందు జరిగిన ఉద్యమాల పుస్తకాలను చదివి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి విజయం సాధించారని అన్నారు. కరీంనగర్ జిల్లా ఖ్యాతిని పెంచిన మహనీయులు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక స్థితిని గాడిన పెట్టింది పుస్తక పఠనం తోనే అని గుర్తు చేశారు. జిల్లాకు చెందిన అనేక మంది గొప్ప గొప్ప సాహితీ వేత్తలు పుస్తక పఠనం ద్వారానే కీర్తి ప్రతిష్టలను పొందారని గుర్తు చేశారు. మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని అన్నారు.

# ఓటమి ఖాయం చేసుకున్న టీమిండియా




**ఇండోర్, మార్చి 02 (సమసమాజం):** ఆస్ట్రేలియాతో ఇండోర్‌లో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆసీస్ స్పిన్ ఉచ్చులో పడి 163 పరుగులకు ఆలౌట్ అయ్యారు. ఈ క్రమంలో కేవలం 74 పరుగులు చేస్తే ఆస్ట్రేలియా విజయం సాధిస్తుంది. మ్యాచ్ రెండో రోజు మొదటి సెషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన బ్యాటర్లు ఏ దశలోనూ ఆసీస్ బౌలర్లను ఎదుర్కోలేకపోయింది. టీమిండియా బ్యాటర్లలో పుజారా (59) మినహా ఏ బ్యాటర్ క్రీజులో నిలబడలేక పోయారు. దీంతో మూడో సెషన్ ముగిసేసరికి 75 పరుగుల ఆధిక్యంలో నిలిచి ఆలౌట్ అయ్యారు. నాథన్ లియాన్ 8 వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్, కుహ్ నెమన్ చెరో ఒక వికెట్ పడగొట్టారు. మొదటి సెషన్లో ఆస్ట్రేలియా 88 పరుగుల లీడ్ తో 197 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తర్వత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇండియా 163 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ మ్యాచులో భారత్ గెలవాలంటే 74 పరుగులలోపు ఆస్ట్రేలియాను కట్టడి చేయాలి. భారత్ టెస్టుల్లో ఆడిన అతి తక్కువ ఓవర్లు 93.5 ఇదే మొదటి సారి. మొదటి ఇన్నింగ్స్ లో 33.2 ఓవర్లలో ఆలౌట్ అయింది. రెండు ఇన్నింగ్స్ ల్లో భారత్ 200 కంటే తక్కువ పరుగులకు ఆలౌట్ అవ్వడం ఇది రెండో సారి. మొదటిసారి 1978లో ఆలౌట్ అయింది. భారత్ పై అత్యధిక వికెట్లు తీసిన రెండవ బౌలర్ గా లియాన్ రికార్డు. శ్రీలంక ముత్తయ మురళిధరన్ మొదటి స్థానంలో ఉన్నాడు. ఇకపోతే రెండో ఇన్నింగ్స్‌లో టాపార్డర్ విఫలం అయింది. స్పిన్నర్ల ధాటికి భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. నయావాల్ ఛతేశ్వర్ పూజారా ఒక్కడే నిలబడ్డాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా కూడా ఓపికగా ఆడిన అతను హాఫ్ సెంచరీ(59)తో ఆదుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియా 109కు ఆలౌట్ అయింది. కునేమన్ ఐదు, లయాన్ మూడు, మర్ఫీ ఒక వికెట్ తీశారు. తర్వాత బ్యాంటిగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 197కు పరిమితం అయింది. రెండో ఇన్నింగ్స్‌లో పూజారా అడ్డు గోడలా నిలిచాడు. ఆసిస్ స్పిన్ త్రయాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ హాఫ్ సెంచరీ సాధించాడు. కునేమాన్ ఓవర్‌లో సింగిల్ తీసి 50 పరుగులకు చేరువయ్యాడు. ఒకవైపు వికెట్లు



పడుతున్నా అతను జడేజా (7), శ్రేయాస్ అయ్యర్(26)తో కలిసి స్కోర్‌బోర్డును ముందుకు నడిపించాడు. టీ బ్రేక్ సమయానికి ఇండియా 79/4 ఉంది. అయితే.. స్టీవ్ స్మిత్ ఫీల్డర్లను మోహరించి బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. దాంతో జడేజా, అయ్యర్ భారీ షాట్లు ఆడలేక పోయారు. డిఫెన్స్ ఆడే క్రమంలో వాళ్లు త్వరగా ఔటయ్యారు. లెగ్ స్లిప్‌లో కెప్టెన్ స్టీవ్ స్మిత్ సూపర్ క్యాచ్ అందుకోవడంతో పూజారా (59) మారథాన్ ఇన్నింగ్స్ ముగిసింది. చివర్లో అశ్విన్ (16), అక్షర్ పటేల్ (15) పర్వాలేదనిపించారు. పిచ్ స్పిన్‌కు అనుకూలించడంతో నాథన్ లయాన్ చెలరేగిపోయాడు. ఏడు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రవిచంద్రన్ అశ్విన్ (16)ను ఎల్బీగా ఔ చేసి ఐదు వికెట్ల ఫీట్ సాధించాడు. భారత్‌పై అతను ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం ఇది తొమ్మిదో సారి. రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసి దీటుగా బదులివ్వాలని టీమిండియా అనుకుంది. కానీ, లయాన్ కీలకమైన వికెట్లు తీసి భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. రోహిత్ శర్మ (12), శుభ్‌మన్ గిల్ (5), రవీంద్ర జడేజా (7), కేఎస్ భరత్(3), పూజారా (59), ఉమేశ్ యాదవ్ (0)లను ఔట్ చేశాడు.లయాన్ బౌలింగ్‌లో ఎక్కువ సార్లు ఔటైన భారత బ్యాటర్‌గా పూజారా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇప్పటివరకు 13 సార్లు పూజారా అతని బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. అజింక్య రహానే (10 సార్లు) రెండు, రోహిత్ శర్మ (8 సార్లు) మూడు, విరాట్ కోహ్లీ (7 సార్లు) నాలుగు స్థానాల్లో ఉన్నారు.






## బూమ్రాకు అత్యాధునిక వైద్యం

### ఆక్లాండ్‌కు తరలించే యోచనలో బిసిసిఐ




ముంబై,మార్చి2(ఆర్ఎన్ఎ): భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయం కారణంగా ఐదు నెలలకు పైగా క్రికెట్‌కు దూరమైన విషయం తెలిసిందే. వెన్నెముక గాయం పూర్తిగా కోలుకోని అతను ఐపీఎల్ 2023 నుంచి కూడా వైదొలిగాడు. అయితే.. టీమిండియాకు ప్రధాన పేసర్ అయిన బుమ్రాకు సర్జరీ చేయించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. అందుకోసం ఈ స్టార్ పేసర్‌ను న్యూజిలాండ్‌కు తరలించనుంది. ఇంగ్లండ్ స్పీడ్‌స్టర్ జోఫ్రా అర్చర్‌కు వైద్యం చేసిన రోవన్ షౌటర్ బుమ్రాకు ట్రీట్మెంట్ చేయనున్నట్టు సమాచారం. ఆక్లాండ్‌లో ఉండే రోవన్ గతంలో న్యూజిలాండ్ ఆటగాళ్లకు ట్రీట్మెంట్ చేశాడు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీకి బౌలింగ్ కోచ్‌గా షేన్‌బాండ్‌కు అతను వైద్యం చేశాడు. దాంతో, అతని సలహా మేరకు బుమ్రాను ఆక్లాండ్‌కు తరలించనున్నారు. బీసీసీఐ వైద్య బృందం, జాతీయ క్రికెట్ అకాడమీ మేనేజర్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. సర్జరీ అనంతరం బుమ్రా కోలుకునేందుకు 20 నుంచి 24 వారాలు పట్టనుంది. దాంతో, అతను ఐపీఎల్‌తో పాటు వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ÷నైల్ మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. అయతే.. స్వదేశంలో అక్టోబర్ నెలలో జరిగే వన్డే వరల్డ్ కప్ వరకు బుమ్రా ఫిట్‌గా అవ్వాలని బీసీసీఐ కోరుకుంటోంది. పోయిన ఏడాది సెప్టెంబర్‌లో చివరిగా మైదానంలోకి దిగాడు. నొప్పితో బాధపడుతున్న బుమ్రాకు ఎన్‌సీఏలో స్కాన్ తీయిస్తే సమస్య తీవ్రంగా ఉందని తెలిసింది. దాంతో, టీ20 వరల్డ్ కప్‌లో ఆడలేదు. అయితే.. ఈమధ్యే అతడిని శ్రీలంక వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన బీసీసీఐ వెంటనే తప్పించింది. ఎందుకంటే..? అతను పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం ఇవ్వాలనుకుంది. అయితే.. బోర్డర్ ? గవాస్కర్ ట్రోఫీ వరకైనా అతను ఫిట్‌నెస్ సాధిస్తాడని అంతా అనుకున్నారు. కానీ, బుమ్రాకు ఎన్‌సీఏ సర్టిఫికెట్ ఇవ్వలేదు.

---




## నాటు నాటుకు కొరియన్ టీమ్ డ్యాన్స్

### రీట్వీట్ చేస్తూ అభినందించిన సద్గురు జగ్గీ వాసుదేవ్



మన నాటు నాటు ఇప్పుడు ప్రపంచాన్ని డాన్స్ చేసేలా చేస్తుంది. దేశం.. భాష తో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు మరియు సంగీత ప్రేమికులు నాటు నాటు పాటను ఎంజాయ్ చేస్తూ స్టెప్స్ తో కవర్ వీడియోలను చేస్తున్నారు. ప్పటికే హాలీవుడ్ స్టార్స్ నుండి ఎన్నో దేశాల సినీ స్టార్స్ నాటు నాటు స్టెప్స్ వేసి సర్ ప్రైజ్ చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఇండియాలోని కొరియన్ రాయబారి టీమ్ సందడి చేసింది. ఆస్కార్ అవార్డ్ కు నామినేట్ అయిన నాటు నాటు పాటకు కొరియన్ రాయబారి టీమ్ వేసిన డాన్స్ ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సద్గురు రీ ట్వీట్ చేసి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ట్విట్టర్ లో... నాటు నాటు పాటకు ప్రపంచం యావత్తు డాన్స్ చేస్తుంది. ఆర్ఆర్ఆర్ టీమ్ కు అభినందనలు. కొరియన్ రాయబారి టీమ్ నాటు నాటు పాటకు డాన్స్ చేశారు. వారికి కూడా నా అభినందనలు అంటూ వీడియోను సద్గురు షేర్ చేశాడు. ఆస్కార్ వేదికపై నాటు నాటు పాట సందడి చేయబోతున్న విషయం తెల్సిందే. ఈ సమయంలో ఇలా అంతర్జాతీయ స్థాయిలో పాటను రకరకాలుగా డాన్స్ లు చేస్తూ మరింతగా వైరల్ అయ్యేలా చేస్తున్నారు. ఈ స్థాయిలో పబ్లిసిటీ దక్కించుకుని.. పాపులారిటీ సొంతం చేసుకున్న నాటు నాటు పాట ఆస్కార్ అవార్డు విన్నింగ్ కు కచ్చితంగా అర్హం అంటూ ప్రతి ఒక్కరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కీరవాణి స్వరపరచిన ఈ పాటను రాజమౌళి అద్భుతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు. చంద్రబోస్ సాహిత్యం అందించగా నాటు నాటు స్టెప్స్ తో రామ్ చరణ్ మరియు ఎన్టీఆర్ లు అదరగొట్టారు. పాటలోని ప్రతి షాట్ కూడా ఒక అద్భుతం అన్నట్లుగా ఉంటుంది.. అందుకే ఈ పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ నామినేషన్ దక్కింది.




## స్టార్ హీరోల సినిమాల కోసం ఆత్రుత

## ఆసక్తిగా చూస్తున్న అభిమానులు

టాలీవుడ్ స్టార్ హీరోలు ఇతర భాషల స్టార్ హీరోలతో పోల్చితే కాస్త స్లో గా సినిమాలు చేస్తున్నారు. ఏడాదికి ఒకటి చొప్పున విడుదల చేయాలనే ఉద్దేశ్యంతో స్లో గా ఉన్నారు. అయితే కొందరు హీరోలు మాత్రం రాబోయే రోజుల్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వారిలో ప్రభాస్ ముందు వరుసలో ఉంటాడు అనడంలో సందేహం లేదు. కొందరు హీరోలు ఈ ఏడాది సినిమాలతో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొందరు హీరోలకు ప్రస్తుతం వారు నటిస్తున్న సినిమాలు అత్యంత కీలకంగా మారబోతున్నాయి. ప్రభాస్ సాహో మరియు రాధేశ్యామ్ సినిమాలు నిరాశ పర్చడంతో ఆదిపురుష్.. ప్రాజెక్ట్ కే.. సలార్ సినిమాల సక్సెస్ అనేది అత్యంత కీలకంగా మారింది. ఈ సినిమాలు హిట్ అయితేనే ప్రభాస్ తన పాన్ ఇండియా స్టార్ డమ్ ను కంటిన్యూ చేసుకోగలడు. ఈ ఏడాదిలోనే ప్రభాస్ నుండి రెండు సినిమాలు వస్తాయని తెలుస్తోంది. ఆ రెండు సినిమాల ఫలితాలపై ప్రభాస్ తో పాటు ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక రామ్ చరణ్ మరియు ఎన్టీఆర్ లు ఆర్ఆర్ఆర్ సినిమా తో గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చారు. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించినా కూడా ఆ ఇద్దరు హీరోలకు కూడా తదుపరి సినిమా అత్యంత కీలకంగా మారింది. రాజమౌళి సినిమాల్లో నటించిన హీరోలు తదుపరి సినిమాలతో ఫెయిల్యూర్ ను చవి చూసిన సందర్భాలు చాలా ఉన్నాయి. అందుకే రామ్ చరణ్ మరియు ఎన్టీఆర్ ల యొక్క తదుపరి సినిమాలు అత్యంత కీలకం అనడంలో సందేహం లేదు. పుష్ప సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో స్టార్ డమ్ ను సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఆ స్టార్ డమ్ ను కంటిన్యూ చేయాలి అంటే కచ్చితంగా ప్రస్తుతం చేస్తున్న పుష్ప 2 సినిమా తో మరో భారీ విజయాన్ని సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. పుష్ప 2 భారీ విజయాన్ని నమోదు చేస్తేనే పుష్ప సినిమా యొక్క విజయానికి ప్రతిఫలం లభించినట్లు అవుతుంది. అల్లు అర్జున్ తో పాటు సుకుమార్ కు కూడా పుష్ప 2 విజయం కీలకం అనే విషయం తెల్సిందే. మహేష్ బాబు గత ఏడాది సర్కారు వారి పాట సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చి పర్వాలేదు అనిపించుకున్నాడు కానీ ఫ్యాన్స్ ఆశించిన స్థాయిలో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. కనుక ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన చేస్తున్న సినిమా తో ఇండస్ట్రీ హిట్ దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి కొందరు యంగ్ హీరోలు కూడా తమ గత సినిమాలతో ఫెయిల్యూర్ ను చవిచూడటం తో ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సక్సెస్ లను దక్కించుకోవాల్సిన పరిస్థితి. చాలా మంది హీరోలకు ప్రస్తుతం చేస్తున్న సినిమాలు అత్యంత కీలకంగా మారాయి. మరి ఎంత మంది హీరోలు ఈ సమయంలో సక్సెస్ లను దక్కించుకుని కెరీర్ లో మరో ముందడుగు వేస్తారు అనేది చూడాలి.

## హీరో కార్తిక్ ఆర్యన్ మరో ప్రాజెక్ట్



బూల్ బులయ్య సిరీస్‌లో భాగంగా కొత్త మూవీ బాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న యంగ్ టాలెంటెడ్ హీరో కార్తిక్ ఆర్యన్ ప్యార్ కా పంచ్ నామా అనే సినిమాతో హీరోగా కెరియర్ స్టార్ట్ చేశాడు. ఇక స్టార్ హీరో అనే గుర్తింపు లుకచుప్పీ సినిమాతో సొంతం చేసుకున్నాడు. ఈ మూవీ తర్వాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస హిట్స్ తో జోరు మీద ఉన్నాడు. ఇక గత ఏడాది బూల్ బులయ్య సీక్వెల్ తో కార్తిక్ ఆర్యన్ ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నాడు. మూవీ మొదటి భాగంలో అక్షయ్ కుమార్ నటించాడు. ఇదిలా ఉంటే ఈ ఏడాది సెహజాదా అనే సినిమాతో తాజాగా ప్రేక్షకుల ముందుకి వచ్చాడు. అల్లు అర్జున్ అల వైకుంఠపురంలో మూవీకి రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కింది. అయితే ఈ మూవీ రిలీజ్ తర్వాత డిజాస్టర్ టాక్ సొంతం చేసుకుంది. ఒరిజినల్ మూవీ దగ్గరకి కూడా ఈ సినిమా రాలేదనే మాట వినిపించింది. ఇదిలా ఉంటే ఇప్పుడు కార్తిక్ ఆర్యన్ తన కొత్త సినిమాని ఎనౌన్స్ చేశాడు. బూల్ బులయ్య సిరీస్ లో భాగంగా పార్ట్3 మూవీని అఫీషియల్ గా ఓ టీజర్ రిలీజ్ చేసి కన్ఫర్మ్ చేశాడు. టి-సిరీస్ ఈ సినిమాని భారీ బ్జడెట్ తో నిర్మిస్తుంది. హర్రర్ కామెడీ జోనర్ లో రాబోతున్న ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. కార్తిక్ ఆర్యన్ రిలీజ్ చేసిన టీజర్ గ్లిమ్స్‌కి రోహ బాబా రిటర్న్స్ దివాలి2024 అని క్యాప్షన్ ఇచ్చాడు. దీనిని బట్టి ఈ మూవీ వచ్చే ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే కార్తిక్ ఆర్యన్ ఈ ఏడాది సత్య ప్రేమ్ కి కథ అనే మరో ఇంటరెస్టింగ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకి వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాలో కార్తిక్ ఆర్యన్ కి జోడీగా కియరా అద్వానీ నటిస్తుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in